# కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వండి

### మోదీకి రాహుల్ లేఖ

ప్రధాని నరేంద్ర మోదీకి లోక్‌సభలో విపక్షనేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ లేఖ రాశారు. అందులో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) వ్యవస్థాపకుడు కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలని కోరారు. ఈ పురస్కారం కాన్షీరామ్‌ను ఆరాధిస్తున్న లక్షలాది మంది ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తుందని పేర్కొన్నారు. కాన్షీరామ్ భారత రాజకీయాల స్వభావాన్ని మార్చారని కొనియాడారు. తన ఉద్యమాల ద్వారా బహుజనులు, పేదలలో రాజకీయ అవగాహన పెంచారని పేర్కొన్నారు. ఈ మేరకు మోదీకి రాసిన లేఖలో రాహుల్ పేర్కొన్నారు. మరోవైపు, బీఆర్ అంబేద్కర్ విషయంలో కాంగ్రెస్ చేసిన తప్పును బీజేపీ ప్రభుత్వం పునరావృతం చేయొద్దని, కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలని బీఎస్పీ అధినేత్రి మాయావతి డిమాండ్ చేశారు. "ఈ రోజు మనం కాన్షీరామ్ జన్మదినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా ఆయనకు మరణానంతరం భారతరత్న ఇవ్వాలని అభ్యర్థిస్తూ ప్రధాని మోదీకి లేఖ రాస్తున్నాను. కాన్షీరామ్ భారత రాజకీయాల స్వభావాన్ని మార్చారు. తన ఉద్యమాల ద్వారా బహుజనులు, పేదలలో రాజకీయ అవగాహన పెంచారు. బహుజనుల ఓటు, గొంతుక, ప్రాతినిధ్యం ముఖ్యమైనదని చాటిచెప్పారు. ఈ దేశం అందరికీ సమానంగా చెందుతుందని గుర్తు చేశారు. కాన్షీరామ్ ప్రయత్నాల కారణంగా ప్రజా జీవితంలోకి రావాలని ఎప్పుడూ ఆలోచించని చాలా మంది న్యాయం, సమానత్వాన్ని సాధించడానికి రాజకీయాలను ఒక మార్గంగా చూడటం ప్రారంభించారు" అని మోదీకి రాసిన లేఖలో రాహుల్ గాంధీ పేర్కొన్నారు.భారత రాజ్యాంగం ప్రతి భారతీయుడికి సమానత్వం, గౌరవం, భాగస్వామ్యాన్ని అందిస్తుందని రాహుల్ గాంధీ తెలిపారు. కాన్షీరామ్ తన జీవితాన్ని సమాజంలోని అట్టడుగున ఉన్నవారికి ఈ విషయాన్ని తెలియజేయడానికి అంకితం చేశారని కొనియాడారు. కాన్షీరామ్ భారత ప్రజాస్వామ్య పునాదులను బలోపేతం చేశారని గుర్తు చేశారు. చాలా ఏళ్లుగా దళిత మేధావులు, నాయకులు, కార్యకర్తలు కాన్షీరామ్‌ను భారతరత్నతో సత్కరించాలని డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. వారి డిమాండ్ సరైనదేనని తాను భావిస్తున్నానని అన్నారు.ఇటీవల నేను ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరయ్యాను. అక్కడ ఉన్న నాయకులు, సభలో పాల్గొన్నవారు కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలనే డిమాండ్‌ను బలంగా పునరుద్ఘాటించారు. కాన్షీరామ్‌కు మరణానంతరం భారతరత్నను ప్రదానం చేయడం ద్వారా దేశానికి ఆయన చేసిన అపారమైన సేవలను గుర్తించినట్లవుతుంది. కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలనే నా అభ్యర్థనను ప్రభుత్వం పరిశీలిస్తుందని ఆశిస్తున్నానని రాహుల్ తెలిపారు.అంతకుముందు బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతి సందర్భంగా ఆయన సేవలను కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రశంసించారు. పేదలు, దళితులు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన అవిశ్రాంత పోరాటం, అంకితభావం తమకు ప్రేరణ అని రాహుల్ అన్నారు. ప్రస్తుతం రాజ్యాంగం ప్రమాదంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన వారు స్వయంగా దానిని అణగదొక్కడానికి చూస్తున్నారని ఆరోపించారు. "బహుజనుల ఐకాన్ కాన్షీరామ్ జయంతి సందర్భంగా ఆయనకు గౌరవపూర్వక నివాళులు. పేదలు, దళితులు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన అవిశ్రాంత పోరాటం, అంకితభావం మనందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి. రాజ్యాంగమే దళితులు, వెనుకబడిన తరగతులు, అణగారిన వర్గాల నిజమైన బలం అని ఆయన విశ్వసించారు. ఆ రాజ్యాంగమే నేడు ప్రమాదంలో ఉంది. అధికారంలో వాటా లేకుండా న్యాయం అసాధ్యం. ఇది కాన్షీరామ్ శాశ్వత సందేశం. బహుజన సమాజం రాజ్యాంగ హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచింది. ఎల్లప్పుడూ నిలుస్తూనే ఉంటుంది.

## బైక్ ఇంజన్ పొగ పీల్చి నలుగురి మృతి

**మొదటి పేజీ తరువాయి...**

ఇంటికి తీసుకెళ్లాడు. రాత్రంతా ద్విచక్ర వాహనం స్టార్టింగ్‌లో ఉంచాలని మెకానిక్ చెప్పడంతో ఇంట్లో తలుపులు వేసి ఇంజిన్‌ను ఆన్ చేశాడు. శనివారం రాత్రి తండ్రి, మనవడు, మనవరాళ్లు ఇంట్లో నిద్రించగా మురళి, రేవతి ఇంటిపైన గదిలో పడుకున్నారు. ఇల్లు ఇరుకుగా ఉండటం, మరోవైపు గాలి బయటకు వెళ్లే వీలు లేక పోవడంతో రాత్రంతా బైక్ నుంచి వెలువడిన పొగ గదిలో వ్యాపించింది. దీంతో తాత, మనవడు, మనవరాళు ఆ పొగ పీల్చి మృతి చెందారు. ఇంటి పైన గదిలో నిద్రించడంతో మురళి, రేవతి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. పిల్లల మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.

## వివేకా హత్య కేసులో... సీబీఐ దర్యాప్తుపై సునీతకు అనుమానాలు

### నిందితులు చెప్పింది వినడమే తప్ప సీబీఐ లోతుగా దర్యాప్తు జరపలేదు

### కోర్టుతో పాటు సీబీఐకి అదనపు ఆధారాలు సమర్పించినా విచారణ జరగలేదు

కడప మార్చి 15 (నిఘా న్యూస్)

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారణ తీరుపై ఆయన కుమార్తె డాక్టర్ సునీత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సీబీఐ బాధ్యతాయుతంగా, లోతుగా దర్యాప్తు చేయలేదని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. కడప జిల్లా పులివెందులలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.ఈ కేసులో తనకు అందరూ అన్యాయం చేస్తున్నారని సునీత ఆవేదన వ్యక్తం చేశారు. "నిందితులు చెప్పింది వినడమే తప్ప సీబీఐ లోతుగా దర్యాప్తు జరపలేదు. హత్యకు ముందు, తర్వాత నిందితుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలను ఏమాత్రం సీరియస్‌గా తీసుకోలేదు. సాక్షిలో గుండెపోటు వార్త రావడానికి నిమిషం ముందే కిరణ్ యాదవ్ అనే వ్యక్తి అర్జున్‌రెడ్డికి మెసేజ్ పంపాడు. ఈ కీలక ఆధారాన్ని సీబీఐ ఎందుకు లోతుగా పరిశీలించలేదని ఆమె ప్రశ్నించారు.తాను కోర్టుతో పాటు సీబీఐకి కూడా అదనపు ఆధారాలు సమర్పించినప్పటికీ, వాటిపై కూడా సరైన విచారణ జరగలేదని సునీత ఆరోపించారు. ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి జగన్, ఆయన అర్ధాంగి భారతిని విచారించాల్సిన అవసరం ఉందని, కానీ సీబీఐ వారిని విచారించలేదని అన్నారు. తాను ఇంతగా పోరాడుతున్నా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేసిన సునీత, న్యాయం జరిగే వరకు తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

## ఉప్పల్‌లో కానిస్టేబుల్ హత్య

ఉప్పల్ మార్చి 15 (నిఘా న్యూస్)

ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలకానగర్– ఆదర్శనగర్ ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది. సాయిబాబా ఆలయ సమీపంలో జరిగిన కత్తిపోటు ఘటనలో ఏఆర్ కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల విశ్వసనీయ కథను ప్రకారం చెంగిచెర్లలోని ఆర్టీసీ కాలనీకి చెందిన సుధీర్ కుమార్ (39), హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ వింగ్‌లో ఏఆర్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి సుమారు 8 గంటల ప్రాంతంలో ఆదర్శనగర్, చిల్కానగర్‌లోని సాయిబాబా ఆలయం సమీపంలో ఉండగా, అతని స్నేహితుడైన సంతోష్ నాయక్ కత్తితో దాడి చేసినట్లు తెలుస్తుంది.సంతోష్ నాయక్ సుధీర్ కుమార్ ని కడుపు, మెడ భాగాల్లో కత్తితో పొడవడంతో, తీవ్ర గాయాల కారణంగా సుధీర్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారైనట్లు తెలిసింది. మృతుడు, నిందితుడు ఇద్దరూ స్నేహితులేనని, అయితే హత్యకు గల అసలు కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

## ఈనెల 22న.. రైతు భరోసా జమ

**మొదటి పేజీ తరువాయి...**

విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. సిద్దిపేట జిల్లా నర్మెట్ట నుంచి రైతు భరోసా నిధులు సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేయనున్నారు. తొలి విడతగా 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి ఒక ఎకరం వరకు నిధులు విడుదల చేస్తారు. ఒక ఎకరం వరకు రైతు భరోసా కింద రూ.3,590 కోట్ల నిధులు విడుదల చేయనున్నారు.రెండో విడతగా మరో 20 రోజుల తర్వాత రూ.2,650 కోట్ల నిధులు, మొత్తం మూడు విడతల్లో రైతుల ఖాతాల్లోకి రూ.9 వేల కోట్లు విడుదల చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోపు మూడో విడతగా మొత్తం రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. రైతు భరోసా నిధుల విడుదలపై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో రేవంత్ రెడ్డి చర్చించారు. దేశవ్యాప్తంగా అర్హులైన 9.3 కోట్లకు పైగా రైతులకు పీఎం కిసాన్ పథకం కింద 22వ విడత నిధులను ఇటీవల విడుదల చేశారు

## అందంగా ఉన్నావని డాక్టర్ వేధింపులు

**మొదటి పేజీ తరువాయి...**

ఉన్నావు అంటూ అనుచితంగా ముట్టుకున్నాడని యువతి కుటుంబ సభ్యులు తెలిపారు.అసౌకర్యంగా అనిపించిన యువతి వెంటనే తన తల్లికి వాట్సాప్ ద్వారా సమాచారం అందించింది. దీంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి చేరుకుని యువతిని అక్కడి నుంచి తీసుకెళ్లి మరో ఆసుపత్రిలో చికిత్స అందించారు.తరువాత ఉదయం బాధితుల తల్లిదండ్రులు ఆసుపత్రికి వచ్చి మహిళా రోగులతో ఈ విధంగా ప్రవర్తించడం సరికాదని డాక్టర్‌ను ప్రశ్నించారు. ఈ సందర్భంగా వాగ్వాదం చోటుచేసుకుని ఆగ్రహించిన కుటుంబ సభ్యులు డాక్టర్‌పై దాడి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని డాక్టర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## మోగిన ఎన్నికల నగారా.... నాలుగు రాష్ట్రాల్లో పోలింగ్

పుదుచ్చేరితోపాటు నాలుగు రాష్ట్రాల శాసనసభల పదవీకాలం మే, జూన్‌లలో వేర్వేరు తేదీల్లో ముగియనుంది. ఈ రాష్ట్రాల్లో ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తి చేసిన ఎన్నికల సంఘం. క్షేత్ర స్థాయి పరిస్థితులను పర్యవేక్షించేందుకు ఆయా రాష్ట్రాల్లోనూ ఇటీవల పర్యటించింది. "ఎన్నికలు జరిగే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతంలో పర్యటించాం. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు పార్టీల నేతల సలహాలు స్వీకరించాం. జిల్లా ఎలక్టోరల్ అధికారులు, ఎస్పీలు, ఐజీలు, డీఐజీలతోనూ భేటీ జరిగింది. చీఫ్ ఎలక్టోరల్ అధికారులు, సీఎస్‌లు, డీజీపీలు, నోడల్ అధికారులతోనూ భేటీ జరిగింది. ఎస్ఐఆర్‌కు సంబంధించి బీఎల్‌వోలకు మౌలిక సదుపాయాలు కల్పించాం. పారదర్శక, నిష్పాక్షికంగా ఎన్నికల కోసమే ఎస్ఐఆర్ నిర్వహిస్తున్నాం. ఓటరు అవగాహన కార్యక్రమాల అధికారులు, యువ ఓటర్లతో మాట్లాడాం" అని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. నాలుగు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతంలో 17.4 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. పారదర్శక, నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. యువత ముందుకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. భారత్‌లో ఎన్నికల నిర్వహణ అంటే ప్రజాస్వామ్య పండుగ అంటూ వ్యాఖ్యానించారు.

**నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరిలో ఇలా..**

మొత్తం ఓటర్ల సంఖ్య – 17.4 కోట్లు
మొత్తం అసెంబ్లీ స్థానాలు 824
పోలింగ్ స్టేషన్లు – 2.19లక్షలు
ఎన్నికల అధికారులు – 25 లక్షలు

"ఐదు రాష్ట్రాల్లో మొత్తం 25 లక్షల మంది ఎన్నికల అధికారులు ఉన్నారు. 15 లక్షల మంది పోలింగ్ సిబ్బంది, 8.5 లక్షల మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. మొత్తం 2.18 లక్షల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. పోలింగ్, ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నాం. దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. దివ్యాంగులు, వృద్ధులు ఇంటి వద్ద నుంచి ఓటు వేసేందుకు దరఖాస్తు చేయాలి. అభ్యర్థుల ఫొటోలు ఈవీఎంలపై ప్రదర్శించాలని సూచించాం. పోలింగ్ ఏజెంట్ల బూత్‌లు వంద మీటర్ల తర్వాత ఏర్పాటు చేయాలి. ఓటరు సేవల కోసం ఈసీఐనెట్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేశాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వందశాతం వెబ్‌కాస్టింగ్ ఉంటుంది" అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు.

బైపోల్స్ ఆరు రాష్ట్రాల్లో 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు జరగనున్నాయి. గోవా, గుజరాత్, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో ఒక్క నియోజకవర్గం చొప్పున ఉపఎన్నిక జరగనుంది. కర్ణాటక, మహారాష్ట్రలో రెండు నియోజకవర్గాల చొప్పున ఉపఎన్నికలు జరుగుతాయి. కర్ణాటక(2), గోవా(1), నాగాలాండ్(1), త్రిపుర(1)లో ఏప్రిల్ 9న ఎన్నికల పోలింగ్ జరగనుంది. మహారాష్ట్ర(2), గుజరాత్(1)లో ఏప్రిల్ 23న ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. మే 4న ఉపఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

## లైఫ్ సైన్సెస్ రంగంలో 300 కోట్ల పెట్టుబడులు

అమెరికాకు చెందిన కేంబ్రిడ్జ్ ఐసోటోప్ ల్యాబొరేటరీస్ , స్థానిక కెమ్ తత్వ చిరల్ సొల్యూషన్స్ సంయుక్తంగా అధునాతన తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చాయి. ఈ కంపెనీలు వచ్చే మూడేళ్లలో రూ.300 కోట్ల పెట్టుబడి పెడతాయని ఐటి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ ఫేజ్--4లో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా 250 మందికి ఉద్యోగాలు లభిస్తాయని ఆయన తెలిపారు. ఆదివారం సచివాలయంలో తనతో సమావేశమైన రెండు కంపెనీల సిఇఒ లు పెట్టుబడులకు అంగీకరించారని ఆయన చెప్పారు.

"లైఫ్ సైన్సెస్, స్పెషాలిటీ కెమికల్స్ రంగాల్లో తెలంగాణ ప్రపంచ స్థాయి కేంద్రంగా ఎదుగుతోంది. కేంబ్రిడ్జ్ ఐసోటోప్ ల్యాబొరేటరీస్, కెమ్ తత్వల భాగస్వామ్యం అంతర్జాతీయ కంపెనీలకు రాష్ట్రంపై ఉన్న ప్రగాఢ విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. ఈ పెట్టుబడి ద్వారా అధునాతన కెమిస్ట్రీ, మెటీరియల్స్ రంగాల్లో రాష్ట్ర సామర్థ్యం మరింత పెరుగుతుంది. ఈ అత్యాధునిక తయారీ కేంద్రంలో ఐసోటోప్ లేబుల్డ్ కాంపౌండ్స్ ఉత్పత్తి అవుతాయి. ప్రాజెక్టు పూర్తి అయితే దేశం వీటి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోగలుగుతుంది. ఔషధ పరిశోధనలు, జీవక్రియపై అధ్యయనాలు, రోగనిర్ధారణ పరీక్షలు, ఆధునిక ఎలక్ట్రానిక్స్, ఆర్గానిక్ ఎలక్ట్రో ల్యూమినిసెంట్ మెటీరియల్స్ సెమీకండక్టర్ రంగాల్లో ఇవి విస్తృతంగా ఉపయోగ పడతాయి. పరిశ్రమకు ఇక్కడ నెలకొని ఉన్న అనుకూల వాతావరణం, నైపుణ్యం కలిగిన శాస్త్రవేత్తలు, అత్యున్నత మౌలిక సదుపాయాలు, మెరుగైన ప్రభుత్వ విధానాల కారణంగా జీనోమ్ వ్యాలీలో పెట్టుబడి పెట్టాలని కంపెనీలు నిర్ణయించు కున్నాయని శ్రీధర్ బాబు వివరించారు. కేంబ్రిడ్జ్ ఐసోటోప్ ల్యాబొరేటరీస్‌తో భాగస్వామ్యం ద్వారా తెలంగాణలో ప్రపంచ స్థాయి తయారీ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయగలమని కెమ్ తత్వ చిరల్ సొల్యూషన్స్ సీఈఓ డా. విశాల్ రాజ్‌పుత్ తెలిపారు.ఈ సమావేశంలో కేంబ్రిడ్జ్ ఐసోటోప్ ల్యాబొరేటరీస్ సీఈఓ క్లిఫ్ కాల్డ్‌వెల్, తెలంగాణా లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలకు.... డ్రగ్స్ టెస్టులు చేద్దామా!

**మొదటి పేజీ తరువాయి...**

స్పష్టం చేశారు. కేటీఆర్, ఆయన అనుచరులు డ్రగ్స్ తీసుకుంటున్నట్లు అనుమానాలు ఉన్నాయి. అవసరమైతే డ్రగ్స్ పరీక్షలకు కేటీఆర్ సిద్ధం కావాలి. అసెంబ్లీ సమావేశాల సమయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరం పరీక్షలు చేయించుకుందాం అని ఆయన సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం కృషి చేస్తున్నారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో డ్రగ్స్ సంస్కృతి పెరిగిపోయిందని ఆరోపించారు.

**డ్రగ్స్ కేసులోకి నన్ను లాగితే చట్టపరంగా నోటీసులిస్తా : కేటీఆర్**

డ్రగ్స్ టెస్టు చేయించుకోవాలన్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సూచనను స్వీకరిస్తున్నానని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నవారు డ్రగ్స్ వాడటం దురదృష్ట కరమన్నారు. వ్యక్తిగతంగా డ్రగ్స్ వాడకాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తానన్నారు. డ్రగ్స్ వాడకం, చట్టవిరుద్ధ కార్యకలాపాలను బీఆర్ఎస్ ఖండిస్తుందని చెప్పారు. డ్రగ్స్‌ను వినియోగించేది ఎంతటివారైనా శిక్షించాలని డిమాండ్ చేశారు.రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు డ్రగ్స్ టెస్టుకు సిద్ధంగా ఉండాలి. నేను ఏ పరీక్షకైనా సిద్ధమని ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశా. ప్రజాప్రతినిధులు డ్రగ్స్ టెస్టు చేయించుకొని అందరికీ ఆదర్శంగా ఉందాం. డ్రగ్స్ కేసులోకి నన్ను లాగితే చట్టపరంగా నోటీసులిస్తా" అని అన్నారు.

**డ్రగ్స్ కేసులో ఎంపీ పుట్టా మహేశ్‌కు స్టేషన్ బెయిల్**

మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌కు స్టేషన్ బెయిల్ మంజూరైంది. ఆయనకు నోటీసులు ఇచ్చి పోలీసులు వదిలేశారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో ఆరుగురికి పాజిటివ్ వచ్చినట్లు ఇవాళ ఉదయం ఈగల్ బృందం ఎస్పీ గిరిధర్ వెల్లడించిన సంగతి తెలిసిందే. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌తోపాటు రితేశ్‌రెడ్డి, నమిత్, కౌశిక్ రవి, అర్జున్‌రెడ్డిలకు పాజిటివ్ వచ్చినట్లు చెప్పారు. శనివారం రాత్రి నిర్వహించిన ర్యాపిడ్ టెస్ట్‌లో ఎంపీ పుట్టా మహేశ్‌కు నెగిటివ్ వచ్చిందని,రక్త పరీక్షలో పాజిటివ్ వచ్చిందని ఎస్పీ తెలిపారు. ఈ క్రమంలో మహేశ్‌కుమార్‌కు స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు.

**ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌పై చంద్రబాబు సీరియస్**

మొయినాబాద్ ఫామ్ హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ వ్యవహారంలో ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ పట్టుబడటంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలను చాలా సీరియస్‌గా తీసుకున్న ఆయన, పార్టీ కార్యకలాపాలకు తక్షణమే దూరంగా ఉండాలని పుట్టా మహేశ్‌ను ఆదేశించారు.

ఈ విషయంపై స్పందించిన చంద్రబాబు పుట్టా మహేశ్ నుంచి వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే, డ్రగ్స్ కేసులో పుట్టా పట్టుబడిన వ్యవహారంపై పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని కూడా పల్లాను ఆదేశించారు.వ్యక్తుల బలహీనతలు, వ్యక్తిగత తప్పిదాల వల్ల పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని చంద్రబాబు తేల్చిచెప్పారు. డ్రగ్స్ వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఎవరైనా సరే, ఉపేక్షించే ప్రసక్తే లేదని పార్టీ జాతీయ అధ్యక్షుడి హోదాలో ఆయన ఉద్ఘాటించారు.

## రంజాన్ తోఫాలు పంపిణీ చేసిన రేవంత్ రెడ్డి

**మొదటి పేజీ తరువాయి...**

పండుగ మాత్రమే కాదు. విలువలను గుర్తుచేసే పవిత్ర మాసం. నెల రోజులపాటు ఆత్మశుద్ధితో పరులకు సహకారం అందిస్తూ అందరితో సత్సంబంధాలను కొనసాగించడమే రంజాన్ మాసం పవిత్రత" అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు తన సందేశంలో పేర్కొన్నారు.

ఈ ఇఫ్తార్ విందులో మంత్రులు మహమ్మద్ అజారుద్దీన్ గారు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్ గారు, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ గారు, లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఓవైసీ గారితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ముస్లిం మతపెద్దలు, మైనారిటీ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

"రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమం కోసం ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్ గారికి మంత్రి పదవి, షబ్బీర్ అలీ గారికి సలహాదారుగా, క్రికెటర్ మహమ్మద్ సిరాజ్‌కు, బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్‌కు డీఎస్పీగా ఉద్యోగ కల్పించడమే కాకుండా 2 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించాం. 8 మంది మైనారిటీ నాయకులను వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా నియమించాం.. " అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తుచేశారు.ఈ రంజాన్ పండుగ ప్రజల్లో సఖ్యత, సోదరభావం తీసుకొచ్చి హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రిస్టియన్లు అందరూ మత సామరస్యంతో రాష్ట్ర అభివృద్ధి ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. ప్రతి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో మైనారిటీలకు సింహ భాగమిచ్చి ముందుకు నడిపిస్తున్నామని, ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లలో మైనారిటీలకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు.

"ఈ ప్రభుత్వం మనందరిదీ. నేను మీ సోదరుడిని. మనమందరం కలిసి తెలంగాణ, హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసుకుందాం. అందరం కలిసి కష్టపడితేనే ఈ రాష్ట్రం, దేశం ప్రగతి పథంలో ముందుకు సాగుతాయి. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో మీ అందరి సహకారం కావాలి" అని కోరారు.

## దేశ ప్రజలు రాహుల్ గాంధీని క్షమించరు

**మొదటి పేజీ తరువాయి...**

రాజకీయాలు చేసుకునే ప్రదేశం కాదని హితవు పలికారు. విపక్షాలకు నిరసన తెలిపే హక్కు తప్పకుండా ఉంటుందని, కానీ ఏఐ సదస్సులాంటి చోట నిరసన తెలపడం సరికాదన్నారు. బీజేపీ, ప్రధానమంత్రి నరేంద్రమోదీలను వ్యతిరేకించే క్రమంలో, చివరకు భారతదేశాన్ని కూడా వ్యతిరేకించడాన్ని రాహుల్ గాంధీ మొదలుపెట్టారని అమిత్‌షా విమర్శించారు. ఆదివారం అసోంలోని గువహటిలో జరిగిన బహిరంగ సభ వేదికగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**రాహుల్ క్షమాపణ చెప్పకపోగా, నిరసనకారులను పొగిడారు**

"భారతదేశాన్ని ఏఐ విభాగంలో బలోపేతం చేసే లక్ష్యంతో ఏఐ ఇంపాక్ట్ సదస్సును దిల్లీలో నిర్వహించాం. కానీ కాంగ్రెస్ నేతలు అక్కడికి వెళ్లిపోయి, అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. వాళ్లలాగే మేం కూడా రాజకీయాల్లో ఉన్నాం. గతంలో ప్రతిపక్షంగా పనిచేసిన అనుభవం సైతం మాకుంది. కానీ ఇలాంటి నిరసన కార్యక్రమాలను మేం నిర్వహించలేదు. ఏఐ సదస్సు అనేది వ్యక్తిగత రాజకీయాలు చేసుకునే ప్రదేశం కాదు. యావత్ ప్రపంచం భారతదేశ ఏఐ టెక్నాలజీని, ఆవిష్కరణలను చూడటానికి, పెట్టుబడులు పెట్టడానికి ఆ సదస్సుకు వచ్చింది. దేశానికి ముఖ్యమైన ఆ సదస్సు దగ్గర కాంగ్రెస్ యువజన విభాగం నేతలు అర్ధనగ్నంగా నిరసన తెలిపినందుకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పకపోగా, ఆ నిరసనలో పాల్గొన్నవాళ్లను ధైర్యవంతులని పొగిడారు. దేశాన్ని అప్రతిష్టపాలు చేసేందుకే కాంగ్రెస్ ఆ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది.ఏ బాధ్యతాయుత రాజకీయ పార్టీ కూడా అలా వ్యవహరించదని నేను భావిస్తున్నాను" అని అమిత్‌షా పేర్కొన్నారు.

## ఇజ్రాయిల్ అధ్యక్షుడికి.... ఇరాన్ 'డెత్ వార్నింగ్'

క్షిపణి దాడి జరిగింది. ఎంబసీ ఆవరణలోని హెలిప్యాడ్‌పై మిస్సైల్ పడటంతో పెద్ద ఎత్తున పొగలు వ్యాపించాయి. మరోవైపు, ఇరాన్‌లోని వ్యూహాత్మక 'ఖర్గ్ ఐలాండ్'పై అమెరికా జరిపిన బాంబు దాడులను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమర్థించుకున్నారు. ఖర్గ్ ఐలాండ్‌లోని సైనిక స్థావరాలను పూర్తిగా ధ్వంసం చేశామని, అవసరమైతే మరిన్ని దాడులు చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రపంచ దేశాలన్నీ హార్మూజ్ జలసంధిలో నౌకల రక్షణకు ముందుకు రావాలని ట్రంప్ పిలుపునిచ్చారు.ఇరాన్ సైన్యం కూడా వెనక్కి తగ్గడం లేదు. ఇప్పటికే ఇజ్రాయెల్‌పై ఐదు సార్లు బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మాట్లాడుతూ తమ దేశ చమురు క్షేత్రాలపై దాడి జరిగితే పశ్చిమాసియాలో అమెరికా వాటాలున్న ప్రతి చమురు కేంద్రాన్ని బూడిద చేస్తామని హెచ్చరించారు. ఈ యుద్ధ ప్రభావంతో బహ్రెయిన్, సౌదీ అరేబియాలో జరగాల్సిన ఫార్ములా–1 రేసింగ్‌లు కూడా రద్దయ్యాయి. ఇరు పక్షాల మధ్య దాడులు, ప్రతిదాడులు తీవ్రం కావడంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం ఏర్పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

# ఊరి అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రథమ ధ్యేయం

- కౌన్సిలర్ ఏనుగు జ్యోతి తిరుపతిరెడ్డి
-వేములవాడ రెండో వార్డు కౌన్సిలర్‌ను ఘనంగా సత్కరించిన శాత్రాజుపల్లి రెడ్డి సంఘం
-కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు: రిటైర్డ్ అధికారి ఆళ్ల స్వామి రెడ్డి







**వేములవాడ/ ప్రజా దివాస్ మార్చి 15** వేములవాడ మున్సిపాలిటీ రెండో వార్డు కౌన్సిలర్‌గా ఇటీవల ఘనవిజయం సాధించిన ఏనుగు జ్యోతి తిరుపతిరెడ్డిని, పశుసంవర్ధక శాఖలో పదవీ విరమణ పొందిన ఆళ్ల స్వామి రెడ్డిని శాత్రాజుపల్లి గ్రామ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, బాధ్యులు మరియు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఆళ్ల స్వామి రెడ్డి మాట్లాడుతూ.. విద్య యొక్క ప్రాధాన్యతను సభ్యులకు వివరించారు. కష్టపడి చదివితేనే సమాజంలో గొప్ప స్థాయిని మరియు ఉద్యోగాలను సాధించవచ్చని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు విద్యే మార్గమని సందేశం ఇచ్చారు.అనంతరం కౌన్సిలర్ ఏనుగు జ్యోతి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలంతా తమపై నమ్మకం ఉంచి గొప్ప విజయాన్ని అందించారని కృతజ్ఞతలు తెలిపారు. శాత్రాజుపల్లి గ్రామంలోని మొదటి మరియు రెండో వార్డుల మధ్య ఎటువంటి వివక్ష లేకుండా, ప్రజలందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానన్నారు. ఊరి అభివృద్ధి మరియు వార్డు ప్రగతిని ప్రధాన ధ్యేయంగా పెట్టుకుని నిరంతరం ప్రజల చెంతనే ఉంటూ పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షులు కొమ్ముల స్వామి రెడ్డి, ప్రధాన కార్యదర్శి అన్నాడి జనార్దన్ రెడ్డి, సంఘ బాధ్యులు, సభ్యులు మరియు ఇతర గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# వేములవాడలో శివాజీ భవన్ నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**వేములవాడ ప్రజా దివాస్ మార్చి 15** వేములవాడ పట్టణ అభివృద్ధిలో కులమతాలకు అతీతంగా సేవలు అందిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని అయ్యోరు పల్లి సమీపంలో ఆరే క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న 'శివాజీ భవన్' నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించి, పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సామాజిక సేవా దృక్పథంతో రాజన్న భక్తులకు నిత్యాన్నదానం ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో ఆరే క్షత్రియ సంఘం శివాజీ భవనాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు. భవన నిర్మాణానికి తమ వంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని సుమారు 54 కులాలను గుర్తించి, ప్రతి కుల సంఘ భవనానికి 5 లక్షల రూపాయల వరకు వెచ్చించి ప్రత్యేక కృషి చేస్తున్నామని వెల్లడించారు.కులమతాలకు అతీతంగా పట్టణంలో అభివృద్ధి జరగాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆరే క్షత్రియ కులస్తులు వెంటనే కమిటీని ఏర్పాటు చేసుకుని, వీలైనంత త్వరగా శివాజీ భవనాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరే క్షత్రియ సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు భక్తులు పాల్గొన్నారు.




# అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్ ల పై కేసు నమోదు

**వేములవాడ ప్రజా దివాస్ )మార్చి 15** వేములవాడ పరిధిలోని పాత కొడుముంజ గ్రామం నుండి ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగింది అని వేములవాడ రూరల్ ఎస్సై వెంకట్రాజం తెలిపారు. వివరాలలోకి వెళితే పాత కోడు ముంజ గ్రామము నుండి సంబంధిత అధికారుల నుండి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా అట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లు TS02UA7028 డ్రైవర్ వడ్డె కృష్ణ, ఓనర్ చంద్రంపేట రమేష్, TS02UC3653 డ్రైవర్ లకావత్ సాయి కుమార్, ఓనర్ లక్ష్మా రెడ్డి ల పై కేసు నమోదు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట్రాజం మాట్లాడుతూ సంబంధిత అధికారుల నుండి అనుమతి తీసుకోకుండా మట్టి గాని ఇసుక గాని అక్రమంగా తరలించినట్టయితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.




# పత్తికుంటపల్లిలో మల్టీవర్కర్లకు ఘన సన్మానం

**ఇల్లంతకుంట,మార్చి15:** ప్రజా దివాస్ ఇల్లంతకుంట మండలం పత్తికుంటపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం లో ఆదివారం 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సర్పంచ్ జుట్టు శేఖర్ ఆధ్వర్యంలో మల్టీవర్కర్లను ఘనంగా సన్మానించారు. గ్రామంలో పారిశుద్ధ్య సేవలు అందిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న మల్టీవర్కర్ల సేవలను గుర్తించి వారికి సాలువాలు కప్పి సన్మానించారు.అలాగే వారి ఆరోగ్య సంరక్షణలో భాగంగా హెల్త్ చెకప్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. గ్రామ అభివృద్ధిలో మల్టీవర్కర్ల పాత్ర ఎంతో కీలకమని సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సాయిసుధా, వార్డు సభ్యులు అభిలాష్, రవి, మల్లయ్య, రాజమణి, పూజా, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# పత్తిపాకలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం



**ధర్మారం, మార్చి 15** ప్రజా దివాస్ ధర్మారం మండలం పత్తిపాక గ్రామంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను ఎంపీవో రమేష్ సమక్షంలో ఆదివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అలాగే కార్మికులకు వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మందాల శ్రావణి--హరీష్, జీపీ కార్యదర్శి తాళ్ళ కిరణ్ కుమార్, ఉప సర్పంచ్ పూసల మల్లేశం, వార్డు సభ్యులు గాజుల ముని, బుర్ల లాస్య, జోగుల లక్ష్మీ కొమురయ్య, కర్నె నరేష్, ఏదుల్ల అంజయ్య, కంపెల్లి కొమురయ్య, రేషవేణి మహేష్, జిల్లాల కాంతారాజు, ఏఎన్ఎం లక్ష్మీ, ఆశా వర్కర్లు జలజ, మమత, సరిత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడే మఠంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఉచిత మెగా హెల్త్ క్యాంప్

**ప్రజలు మెగా హెల్త్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలి :**
**ప్రా. ఆ. కేం. వైద్యాధికారి డా,, కళ్యాణి**



**హుజూర్ నగర్: మార్చి 15 ప్రజా దివాస్ )** సూర్యా పేట జిల్లా మఠంపల్లి మండలం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు సోమవారం మార్చి 16 న ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు మఠంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కళ్యాణి తెలిపారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మఠంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. కళ్యాణి మాట్లాడుతూ మఠంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించడం (సమయం 9 గంటల నుండి నాలుగు గంటల వరకు ) జరుగుతు ందన్నారు . ఈ క్యాంపు కు ఈ క్రింద సూచన సూచించిన డాక్టర్లు స్త్రీల వైద్యనిపుణులు ,జనరల్ మెడిసిన్ భాగం వైద్యనిపుణులు,కంటి వైద్య నిపుణులు ,చిన్నపిల్ల ల వైద్య నిపుణులు ,ఆర్థోపెడిక్ విభాగం వైద్య నిపుణులు ,డెంటల్ వైద్యనిపుణులు ,వస్తున్నారని కావున ఈ మెగా హెల్త్ క్యాంప్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంపు కు వచ్చేటప్పుడు ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు తీసుకుని రావాలని కోరారు.

# మహిళ సంఘ భవనానికి భూమి పూజ చేసిన గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి



**ముస్తాబాద్ / మార్చ్ 15** ప్రజా దివాస్ రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నూతన స్వశక్తి మహిళా భవనానికి గ్రామ సర్పంచి మట్ట వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ ఉప సర్పంచ్ తాళ్ల విజయ్ వార్డు సభ్యులు భాను గౌశీదయ్య శీలం పద్మ మహిళా సంఘాల సిఏలు తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల జిల్లా మార్చి 15 ప్రజా దివాస్** గంభీరావుపేట మండలం సముద్ర లింగాపూర్ గ్రామంలో నిమ్మ రాజుల గౌరవ్వ మల్లేశం ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ గంభీరావుపేట ఎల్లారెడ్డిపేట ఏఎంసీ చైర్మన్లు కోమిరిశెట్టి విజయలక్ష్మి తిరుపతి షేక్ సాబేర బేగం గౌస్ బాయ్ గంభీరావుపేట ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హమీద్ సద్ది లక్ష్మారెడ్డి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య సూర దేవరాజు , కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కే రామచంద్ర రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం చేశారు, ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిమ్మ రాజుల గౌరవ్వ మల్లేశం మాట్లాడుతూ మేము ఇల్లు కట్టుకుంటామని మా కళలో కూడా అనుకోలేదు తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మా కుటుంబానికి పెద్దన్న లాగా ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయడం వల్ల మేము ఇల్లు కట్టుకొని శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం చేయడం గృహప్రవేశం చేసుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులను బంధుమిత్రులను కులస్తులను ఆహ్వానించి భోజనం పెట్టగల్గామని వారు సంతోషం వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా గ్రామానికి మొట్టమొదటిసారిగా వచ్చిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాసు ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్ర కిషన్ గౌడ్ తన ఇంటికి ఆహ్వానించి టీ విందు ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పరుస హనుమాన్లు , ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఆనంద్ వార్డు మెంబర్లు ఎర్ర సంతోష్ గౌడ్ బానోత్ రమేష్ మాజీ ఎంపీటీసీ సభ్యులు పరిసరాములు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్ర కిషన్ గౌడ్ , బండారి బాల్రెడ్డి ఎద్దండి ఎల్లారెడ్డి, బర్కూటీ పెద్ద రాజయ్య , దరువు విజయ్ బుల్లి మల్లేశం యాదవ్ కె నాంపల్లి సీతాల రాజ్యం పిట్ల వెంకటి పంతం సురేష్ నిమ్మల తిరుపతి గౌడ్ పూజా రాయనరసు సంతోష్ లు తదితరులు పాల్గొన్నారు,



## ఘనంగా మాస్టర్ మైండ్ స్కూల్ నూతన భవనం ప్రారంభం



**ధర్మారం, మార్చి 15 ప్రజా దివాస్** ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామంలో మాస్టర్ మైండ్ స్కూల్ నూతన భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ మంద సుజాత లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో హాజరయ్యారు. వేద మంత్రోచ్చరణల నడుమ హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించి నూతన భవనాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ కొడారి మంగ హన్మయ్య, ఉపసర్పంచ్ తమ్మడవేణి రాజయ్య, వార్డు సభ్యులు ఆలువాల భాగ్య రాజేశం, దాడి సదయ్య, కొమ్మ శ్రావణి పరమేష్, వేల్పుల కుమార్ పాల్గొన్నారు. అలాగే గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## చిన్నారి ఉజ్వల్ నాయక్ ని ఆశీర్వధించిన భూక్యా సురేష్ నాయక్



**ఖమ్మం ప్రతినిధి మార్చి 15 ప్రజా దివాస్** ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 29 వ వార్డు కి చెందిన బోడ సుందర్ చంద్రకళ దంపతుల కుమారుడు కోడలు బోడ నవీన్ సంధ్యాల కుమారుడు ఉజ్వల్ నాయక్ అన్నప్రాసన వేడుక వరంగల్ క్రాస్ రోడ్ లో వారి స్వగృహం లో జరగగా వెళ్లి చిన్నారి ఉజ్వల్ నాయక్ ని నిండునూరేళ్ళు అష్టైశ్వర్య ఆయురారోగ్యాలతో ఉండాలని ఆశీర్వధించిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్. వారితో పాటు ఈ కార్యక్రమం లో మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు కళ్లెం శేషి రెడ్డి, ఇమ్మడి శ్రీనివాస యాదవ్, భద్రా చారీ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపరిశుద్ధ సిబ్బందిని సన్మానించిన గ్రామ సర్పంచ్



**ముస్తాబాద్ / మార్చ్ 15 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం మేజర్ గ్రామపంచాయతీలో పరిశుద్ధ కార్మికులుగా పనిచేస్తున్నటువంటి సిబ్బందికి గ్రామ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర రెడ్డి చేతుల మీదుగా డ్రెస్ లు అందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం పరిశుద్ధముగా ఉండాలంటే సిబ్బంది యొక్క పనితొ గ్రామాలు అభివృద్ధి చెందుతాయని వారి సేవలు ఉత్తమమైనవని వారన్నారు కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి ఉప సర్పంచ్ తాళ్ల విజయ్ పంచాయతీ కార్యదర్శి బాలకిషన్ బిక్షపతి వార్డు సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు

